క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్, తెలకపల్లి, బిజినేపల్లి మండలాలకు సంబంధించిన 77 మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అందజేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మాజీ కౌన్సిలర్లు, మండల నాయకులు, యువజన నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

తెలకపల్లి: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ పాఠశాలలో రెండో వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అదేవిధంగా పెద్దూరులో లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల చైర్మన్ భరత్ సింహరెడ్డి, కరస్పాండెంట్ రాజు, ఆలయ చైర్మన్‌గా గోవర్ధన్ రెడ్డి, కమిటీ సభ్యులుగా తిరుపతయ్య, బాలస్వామి, శ్రీనివాస్ రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

కొల్లాపూర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు చేపట్టాకే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చే అసెంబ్లీ సమావేశంలో వర్గీకరణ బిల్లు తెచ్చిన తర్వాతనే రాష్ట్రంలో అన్ని ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా దండోరా ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



పెద్దకొత్తపల్లి: మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన లక్ష్మణ్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 10వ తరగతి 2010–11 బ్యాచ్‌కు చెందిన మిత్రులు డబ్బులను పోగుచేసుకొని మొత్తం రూ. 25 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రాజేష్‌రెడ్డి, గణేష్, ఖాజా, జాకీర్, వినీత్ గౌడ్, రాము, మహేష్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఇళ్ల స్థలాలు వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సర్వే నంబర్ 22, 27లో గుడిసెలు వేసుకుని 40 రోజుల పాటు ఆందోళన చేపట్టి ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టామన్నారు. కాని అధికారులు ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, తిమ్మస్వామి, రాజు, మధు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా కమిటీ ఎన్నిక

కోడేరు: మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా దీప, కన్వీనర్‌గా సాయిలీల, వెంకటమ్మ, చెన్నమ్మ, పద్మ, పుష్పలతో పాటు మరో 12 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

వీపనగండ్ల: గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం పలు శాఖల ఉద్యోగులతో గ్రామసభ నిర్వహించారు. జాబ్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవడం, అభివృద్ధి పనుల్లో పాలు పంచుకోవడం అనే అంశాలపై అవగాహన కల్పించామన్నారు.



కల్వకుర్తిలో మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి



నాగర్‌కర్నూల్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేస్తున్న మహిళలు



అచ్చంపేట మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శనివారం అంతర్జాతీయంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను శాలువా, మెమెంటోలతో సన్మానించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు మహిళా కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం కూచుకుళ్ల ఫౌండేషన్ తరుపున దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ చేశారు. జనరల్ ఆస్పత్రిలో తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు జానకి దేవి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా కమిటీ, సీపీఎం ఆధ్వర్యంలో, ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో, భారత జాతీయ మహిళా సమైక్య ఆధ్వర్యంలో మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కందికొండ గీత, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ కేక్ కట్‌చేసి మహిళా సిబ్బందికి పంచారు. శ్రీవాణి విద్యానిలయంలో టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు మహిళలను సత్కరించి, దుస్తులు పంచారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా సిబ్బందిని డీఎం ఉమాశంకర్ సత్కరించారు. ఆర్యవైశ్యసంఘం, క్లాస్‌మేట్ క్లబ్, వాసవీ వనితా క్లబ్ సభ్యులు సంయుక్తంగా మహదేవీ డిగ్రీ కళాశాలలో, మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. ఐద్వా ఆధ్వర్యంలో మాధవస్వామి దేవాలయ ప్రాంగణంలో, ఆశావర్కర్ల సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద వేడుకలు చేపట్టారు.

■ ఉప్పునుంతల మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రమీలతోపాటు మహిళా సిబ్బందిని, పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లను సన్మానించారు.

■ నాగర్‌కర్నూల్‌రూరల్ పరిధిలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఎంఎస్పీ, ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్ చెంచుగూడెంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో చెంచు మహిళలకు ఆటల, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

■ అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలో సీబీఎం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరై మాట్లాడారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. గ్రంథాలయ జిల్లా చైర్మన్ గంగాపురం రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, డాక్టర్ అనురాధ, మున్సిపల్ కమిషనర్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

■ పెంట్లవెల్లి మండల కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవాన్ని ఐద్వా మహిళ సంఘం మండల కార్యదర్శి ఆదిలక్ష్మి హాజరయ్యారు.

■ కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో, బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో, జడ్జిలు శ్రీదేవి, కావ్య, టాస్క్ సీఓఓ రాఘవేందర్‌రెడ్డి, డా. రమ్య సౌజన్య తదితరులు హాజరయ్యారు. విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు.



నాగర్‌కర్నూల్‌లో దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

■ చారకొండ మండలంలోని మర్రిపల్లిలో గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి రవిశంకర్ మహిళలకు శాలువాలతో సన్మానించారు.

■ లింగాల మండల కేంద్రంలో ఐసీడీఎస్, ఆర్డీటీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించారు. ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి, ఎస్ఐ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

■ మన్ననూర్‌లో ఎస్ఐ ఇందిరతో పలువురు మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను స్థానికులు సన్మానించారు.

■ వెల్దండ మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఏపీఓ ఈశ్వర్‌జీ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింట మహిళలు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు.

■ కోడేరు మండల కేంద్రంలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ, రవి, వెంకటస్వామి, తదితరులు హాజరయ్యారు.



వెల్దండ మండలం చెర్కూర్‌లో..



పెంట్లవెల్లిలో..



ఉప్పునుంతల మహిళా పోలీసులను సన్మానిస్తున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి



లింగాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..



మన్ననూరులో..



కొల్లాపూర్‌లో..



కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో..

వైభవంగా లక్ష్మీనరసింహ్మస్వామి కల్యాణోత్సవం

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లిలో శనివారం లక్ష్మీనరసింహ్మస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వరుని పూజతో ఉత్సవాలను ప్రారంభించి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, దూప దీప నైవేద్యం చేపట్టారు. ఉదయం 9.31 గంటలకు పుణ్యాహవాచన, నవగ్రహపూజ, సుదర్శన హోమం అనంతరం మధ్యాహ్నం లక్ష్మీనరసింహ్మ స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారిని పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యాదిరెడ్డి, నాయకులు కట్టా అనంతరెడ్డి, నర్సింహ్మారావు, రంగారెడ్డి, నిర్వాహకులు జగత్‌రెడ్డి, బూరం పర్వతాలు, దర్శ కిరణ్య, నరేందర్‌రెడ్డి, ప్రజలు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అయ్యవారిపల్లిలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నిధులు లేక ఇబ్బందులు



ఊర్కొండ పేట గ్రామ పంచాయతీ భవనం

ఊర్కొండ: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం సరిపడ నిధులు కేటాయించడం లేదు. దీంతో పల్లెల ప్రగతి కుంటుపడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించడంతో పూర్తిగా విఫలం అయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. తూతూ మంత్రంగా నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంటున్నారు. సర్పంచుల కాలం ముగిసిన తర్వాత ప్రత్యేక పాలనలో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. పంచాయతీలో మౌలిక వసతుల కల్పన కోసం వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలో ఉన్న జనాభా ప్రాతిపదికన ఆరు నెలలకు ఒకసారి మంజూరు చేస్తుంది. అయితే ఫిబ్రవరి నుంచి కేంద్రం నుంచి నిధులు విడుదల చేయలేదు.

మండలంలో 16 జీపీలు

మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఆయా గ్రామ పంచాయతీలలో సుమారు 21956 జనాభా ఉన్నారు. ఏడాదికి మండలానికి రూ.1.86 కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తోంది. సకాలంలో రాకపోవడంతో గ్రామ పంచాయతీల నిర్వహణ ఇబ్బందిగా మారింది.

క్రెడిట్ ఇవ్వడానికి ఏజెన్సీలు నిరాకరణ

గ్రామ పంచాయతీల నిర్వహణకు కావలసిన వీధి లైట్లు, శానిటరీ పౌడర్ స్టేషనరీ తదితర వంటి సంబంధిత గ్రామ పంచాయతీలకు క్రెడిట్ ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో వారు వివిధ వస్తువులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు.


భారంగా మారిన ట్రాక్టర్ నిర్వహణ

గ్రామాల్లో సేకరణ, మట్టి రోడ్ల నిర్వహణ గ్రామ పంచాయతీలో ట్రాన్స్‌పోర్ట్ నిర్వహణకు మొక్కలకు నీరు అందించడానికి, చెత్త సేకరణకు పలు పనుల కోసం ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్‌ను కేటాయించింది. గ్రామ పంచాయతీ అకౌంట్లో డబ్బులు లేక చెత్త సేకరణ కోసం గతంలో రోజువారీగా ట్రాక్టర్‌ని నడిపేవారు నిధుల కొరతతో ఒకసారి లేదా రెండుసార్లు గ్రామాలలో చెత్తను సేకరిస్తున్నారు. గ్రామాల్లో నాటిన మొక్కలకు సైతం నామమాత్రంగా నీటిని అందిస్తున్నారు.

మల్టీ పర్పస్ వర్కర్లకు మాత్రమే..

రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ పనులకు సంబంధించిన వేతనాల నిధులను జనవరి వరకు మాత్రమే అందజేసింది. గ్రామ పంచాయతీలకు వివిధ పన్నుల రూపంలో వచ్చిన నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ ఫ్రీజింగ్ కావడంతో చెక్కులు సకాలంలో పాస్ కావడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా గ్రామ పంచాయతీలకు సంబంధించిన బిల్లులను సకాలంలో పాస్ అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

నిర్వహణ భారంగా మారింది



గ్రామ పంచాయతీలో వివిధ రూపాల్లో వసూలు అయిన టాక్స్‌లను గ్రామ పంచాయతీల నిర్వహణకు వాడుకుంటున్నాం, కొన్ని రోజుల వరకు గ్రామాల్లోని మాజీ సర్పంచులు గ్రామపెద్దలు గ్రామ పంచాయతీ నిర్వహణ కోసం పెట్టుబడులు పెట్టారు. దాతుల ముందుకు వచ్చి గ్రామా అభివృద్ధికి సహకరించాలి.

– కృష్ణయ్య, ఎంపీడీఓ, ఊర్కొండ

క్రీడలతో మానసికోల్లాసం

కల్వకుర్తి రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్తేజం లభిస్తాయని మండల విద్యాశాఖ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు డివిజన్ స్థాయి క్రికెట్, షటిల్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలోని ఆరు మండలాల ఉపాధ్యాయులు ఈ పోటీలలో పాల్గొన్నారు. తరగతి గదులకే పరిమితమయ్యే ఉపాధ్యాయులు క్రీడలలో రాణించేందుకు పోటీలలో పాల్గొనడం శుభ పరిణామం అని ఎంఈఓ అన్నారు. తొలి మ్యాచ్ ఊరుకొండ చారకొండ ఉపాధ్యాయుల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనరసింహారావు, డివిజన అధ్యక్షుడు పోరెడ్డి రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, జంగయ్య, వెంకటగౌడ్, రఘురాంరావు, శంకర్, నరేష్, రాజు, సాయి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

ఉప్పునుంతల: మండలంలోని లత్తీపూర్ శివారు శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో డిండి ప్రాజెక్టు సమీపంలోని హరిత హోటల్ ఎదుట శనివారం కారు, బైక్ ఢీకొని మండలంలోని వెల్టూరుకు చెందిన యువకుడు కొంగర మల్లేష్ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సలు చేసిన అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్సల కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. మల్లేష్ తన బైక్‌పై నల్గొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లిలో బంధువుల ఇంట్లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని తిరిగి బైక్‌పై గ్రామానికి వస్తుండగా అచ్చంపేట వైపు నుంచి డిండి వైపు ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

లింగాల: మండలంలోని దారారం సమీపంలో ఉన్న వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించుటకు సిద్ధంగా ఉంచిన 3 ట్రాక్టర్లను, ఒక జేసీబీని శనివారం స్వాధీన పర్చుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. లింగాలకు చెందిన గొల్ల బుడ్డయ్య అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి ఇసుకను ఫిల్టర్ చేస్తూ అక్రమ దందా కొనసాగిస్తున్నాడని ఎస్ఐ తెలిపారు. సమాచారం మేరకు వాగును పరిశీలించగా ట్రాక్టర్లు, జేసీబీ పట్టుబడడంతో వాటిని స్వాధీన పర్చుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లబెల్లం, పట్టిక స్వాధీనం

మండల కేంద్రానికి సమీపంలోని మగ్దూంపూర్ చౌరస్తాలో ఉన్న ఓ డబ్బాలో సారా తయారీకి ఉపయోగించే 20 కిలోల బెల్లం, 2 కిలోల పట్టికను శనివారం స్వాధీన పర్చుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం దేవాలయంలో శివలింగానికి, అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో భక్తులు సత్యనారాయణ స్వామి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు జియగూడ కబేలమేల సంఘం అధ్యక్షుడు జక్కుల చిన్న జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ్‌నాయక్, ఆలయ అర్చకులు శివకుమార్‌శర్మ, సంతోష్‌శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మ, బాలస్వామి శర్మ, కృష్ణయ్యశర్మ తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

మామిడి మార్కెట్ ఏర్పాటయ్యేనా?

వీపనగండ్ల: పండ్ల తోటలను సాగుచేసే రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మామిడి తోటల పెంపకంలో సబ్సిడీ ఎరువులు, కాయల నాణ్యత కోసం అవసరమయ్యే చర్యలు, విక్రయ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించకపోవడంతో కుదేలవుతున్న రైతులను ఆదుకునే ఆపన్నహస్తం కోసం మామిడి రైతులు, కౌలుదారులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక కావడంతో..

కేంద్ర ప్రభుత్వం పంటల సమూహ అభివృద్ధి పథకం కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగు చేస్తున్న మామిడి తోటలను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి రూ.172 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించడంతో రైతులు సంతోషించారు. ఈ పథకం ద్వారా తోటల విస్తరణ పెంపు, పాత తోటల పునరుద్ధరణ, సమగ్ర సస్యరక్షణ చర్యలు, ప్లాస్టిక్ బుట్టల పంపిణీ, తోటల యజమానులకు యంత్ర సామగ్రిని సమకూర్చడం, అధిక దిగుబడుల కోసం శిక్షణ, క్షేత్రస్థాయి సంఘర్షణ వంటి కార్యక్రమాలను చేపడుతామని ప్రకటించినా.. ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. పథకం ప్రారంభమై మూడేళ్లు గడిచిన ఆర్థిక వెసులుబాటుకు సంబంధించిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

మండలవ్యాప్తంగా..

మండలంలోని 14 గ్రామాల్లో 2,064 మంది రైతులు 4,801 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. మామిడికాయలను హైదరాబాద్‌కు తీసుకెళ్లి ప్రతి యేటా దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రవాణా ఖర్చులతో పాటు తరుగు పేరుతో వచ్చిన డబ్బుల్లో 20 శాతం దాకా కోత విధిస్తున్నారని వాపోతున్నారు. మామిడి పంట విక్రయాల కోసం కొల్లాపూర్ పట్టణంలో మార్కెట్ వసతులు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు అందుకు అవసరమైన చర్యలను తీసుకోలేదు.



మామిడి కాయల నాణ్యత కోసం అమర్చిన కవర్లు

మద్దతు ధర ప్రకటిస్తేనే..

మామిడి తోటల పెంపకంలో పెట్టుబడులు రోజురోజుకూ పెరిగి ఎకరాకు రూ.60 వేల దాకా ఖర్చవుతుంది. క్రిమిసంహారక మందులు, తెగుళ్ల నివారణ, తేనేమంచు పురుగు వల్ల దిగుబడి ఆశించిన స్థాయిలో రావడం లేదు. వరి పంటకు ప్రకటించిన విధంగానే మామిడికి కూడా మద్దతు ధర ప్రకటించాలి. ఈ వేసవి సీజన్‌లో మామిడి తోటలకు కోతుల బెడద ఎక్కువ అవ్వడంతో చేతికి వచ్చిన మామిడి కాయలు నేలపాలవుతున్నాయి.

సబ్సిడీలు అందిస్తున్నాం

పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక కావడంతో మామిడి రైతులకు క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 50 శాతం సబ్సిడీతో ఫ్రూట్ కవర్లు అందజేస్తున్నాం. రాబోయే రోజుల్లో కాయల రవాణా కోసం అవసరమైన బాక్సులతో పాటు రవాణా వసతుల మెరుగు కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం.

– కృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి, వీపనగండ్ల

తండాల్లో సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని గిరిజన తండాలలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ముక్కిడిగుండం తండాలో గిరిజనులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా చేసింది కాని అభివృద్ధి శ్రద్ధ పెట్టలేదని విమర్శించారు. తండాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు కొందరికి ఇప్పటివరకు పట్టాలివ్వడంలేదన్నారు. చెంచుగూడెలలో నేటి వరకు చెంచులకు రేషన్ కార్డులు కూడా లేవు, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో గిరిజనులతో కలిసి ప్రభుత్వంపై ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు పాల్గొన్నారు.